ప్రజా సంకల్ప యాత్రతో సుపరిపాలన



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల, తదితరులు

ఎంవీపీ కాలనీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేత హోదాలో చేపట్టిన ప్రజా సంకల్ప యాత్రకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల ఆధ్వర్యంలో సోమవారం సంబరాలు జరిపారు. ముందుగా బీచ్ రోడ్డులోని దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి మేయర్ గొలగాని హరివెంకటకుమారి, విజయనిర్మల, తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జగనన్న ప్రజా సంకల్ప యాత్ర ద్వారా ప్రజల కష్టాలు తెలుసుకున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత బడుగు బలహీన వర్గాలకు మేలు చేకూరేలా సుపరిపాలన చేపడుతున్నారని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఒక్క పేదవాడికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ ఆర్థిక భరోసా లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి మొల్లి అప్పారావు, కార్పొరేటర్లు మువ్వల లక్ష్మి, సురేష్, అక్కరమాని రోహిణి, ఉమ్మడి స్వాతి దాస్, కెల్ల సునీత, పల్లా అప్పలకొండ, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, బీసీ సెల్ అధ్యక్షుడు సూరడా దాస్, తదితరులు పాల్గొన్నారు.

బాధితులను కాకుండా బాధ్యుడికి పరామర్శా?

- చాలా విచిత్రంగా పవన్ కల్యాణ్ ప్రవర్తన
- వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని ధ్వజం
- 22వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న అక్కరమాని విజయనిర్మల

ఎంవీపీ కాలనీ: జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రవర్తన చాలా విచిత్రంగా ఉందని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల అన్నారు. సోమవారం జీవీఎంసీ 22వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ సీఎం చంద్రబాబు పబ్లిసిటీ పిచ్చి కారణంగా ఇటీవల రెండు దుర్ఘటనలో చనిపోయిన 11 మంది బాధిత కుటుంబాలను పరామర్శించకుండా.. ఆ ఘటనలకు కారణమైన బాబును పరామర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. కనీసం మృతుల కుటుంబాలకు సంతాపం తెలపలేని పవన్ కల్యాణ్.. రోడ్లపై బహిరంగ సభలు పెట్టి మరింత మందిని పొట్టన పెట్టుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజా రవాణాతో కాలుష్య నియంత్రణ



జీవీఎంసీ వద్ద బస్సు దిగుతున్న మేయర్

డాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణలో భాగంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి మేయర్ గొలగాని హరివెంకటకుమారి సోమవారం ఉదయం తన క్యాంపు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం స్పందన, తదితర కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం బస్సులో క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణలో భాగంగా వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను ఉపయోగించాలన్నారు. నగర పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ యజమాన్యాలు తమ ఉద్యోగులకు వారంలో ఒక్క రోజు ప్రజా రవాణా ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మానసిక ఆస్పత్రికి స్టౌ విరాళం



స్టౌ అందిస్తున్న అన్నపూర్ణ నిత్యాన్నదానం ట్రస్ట్ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ: విశాఖ మానసిక ఆస్పత్రిలో నిత్యాన్నదానికి పలువురు స్టౌ విరాళంగా అందజేశారు. మహారాజా విజయరామ గజపతి రాజు ఇంజినీరింగ్ కళాశాల 2010 బ్యాచ్ విద్యార్థులు ఈ స్టవ్‌ను విరాళంగా ఇచ్చారు. మానసిక ఆస్పత్రిలో నిత్యాన్నదానం చేస్తున్న అన్నపూర్ణ నిత్యాన్నదానం ట్రస్ట్ ప్రతినిధులకు ఈ స్టౌను అందజేశారు. ఈ సందర్భంగా రోగుల సంక్షేమం కోసం ట్రస్ట్ చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మధన్‌వర్మ, లక్ష్మణ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

18న పోలమాంబ అమ్మవారి పరస



పరస వివరాలతో కూడిన ఫ్లెక్సీని విడుదల చేస్తున్న ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు

ఎంవీపీ కాలనీ: కరకచెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక పరస ఈ నెల 18న వైభవంగా నిర్వహించనున్నారు. సోమవారం జరిగిన ఆలయ ధర్మకర్తల మండలి సమావేశంలో పరస ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఏపీ దేవదాయ ధర్మదాయశాఖ సీజీఎఫ్ కమిటీ సభ్యుడు ఎం.వెంకట పాపారావు ఈ కార్యక్రమంలో పాల్గొని పరస ఫ్లెక్సీతో పాటు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా దేవదాయశాఖ అధికారి కె.శిరీష మాట్లాడుతూ 18న జరిగే పరస మహోత్సవంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పి.శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్య దైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాలలో చిన్నారులు

ఆరిలోవ: ఆదర్శనగర్‌లోని ఓ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా సాగాయి. చిన్నారులు నూతన వస్త్రాలు ధరించి ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు చిన్నారులకు భోగి పండ్లు పోయడం, భోగి మంట వేశారు. పిల్లలతో పాటలు పాడించారు. వివిధ రకాల బొమ్మలతో కొలువు ఏర్పాటు చేశారు. దీంతో పిల్లలు సరదాగా గడిపారు.

రహదారులపై విస్తృతంగా ట్రాఫిక్ సూచికలు



ఇసుకతోట కూడలిలో రహదారిపై గీసిన స్టాప్ పాయింట్

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా లైన్స్ ఏర్పాటు పనులు గత కొన్ని రోజులుగా శరవేగంగా జరుగుతున్నాయి. జాతీయ రహదారితో పాటు హెచ్‌బీ కాలనీ, ఎంవీపీ కాలనీ, అప్పుఘర్, వాల్తేర్ తదితర ప్రాంతాల్లో ఈ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా పలు ప్రాంతాల్లో రహదారులపై ట్రాఫిక్ హెచ్చరికలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేసినట్లు ఎంవీపీ ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా వాహనదారుల అవసరాల మేరకు ఈ పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెచ్‌బీ కాలనీ, ఇసుకతోట, అప్పుఘర్, వీఎంఆర్‌డీఏ రోప్ వేతో పాటు ఎంవీపీ కాలనీలోని పలు ప్రాంతాల్లో ఈ పనులు జరుగుతున్నాయన్నారు. స్పీడ్ బ్రేకర్ల నిర్మాణంతో పాటు జీబ్రా లైన్ పెయింటింగ్ పనులు ఇప్పటికే పూర్తికాగా రహదారులపై ట్రాఫిక్ సూచనలతో కూడా పెయింటింగ్ పనులు సోమవారం నిర్వహించినట్లు తెలిపారు. ఇసుకతోట కూడలి, ఎంవీపీ డబుల్‌రోడ్డు, వెంకోజీపాలెం, ఆటోమోటివ్ కూడలి, టీటీడీ కల్యాణ మండపం, లడ్డూ గోపాల్, కైలాసగిరి రోప్ వే, కురపాం జంక్షన్లలో ట్రాఫిక్ సూచనలతో కూడిన ఫెయింటింగ్ పనులు పూర్తి చేశామన్నారు.

కార్మికుల సమ్మెతో ఎక్కడి చెత్త అక్కడే!



బాలాజీనగర్ గెడ్డ అంచున యూపీహెచ్‌సీ ముందు రోడు నిల్వ ఉన్న చెత్త

ఆరిలోవ: జీవీఎంసీలో కాంట్రాక్ట్ వర్కర్ల యూనియన్ సమ్మెకు పిలుపునివ్వడంతో పారిశుధ్య కార్మికులు సోమవారం విధులకు హాజరు కాలేదు. ఇళ్లలో తడి, పొడి చెత్త తీసుకెళ్లే జీవీఎంసీ చెత్త సేకరించే వాహనాలు కూడా వీధుల్లోకి రాలేదు. దీంతో వీధుల్లో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయింది. ఇళ్లలో చెత్త డబ్బాలు నిండిపోయాయి. వీధుల్లో దుర్వాసన వెదజల్లుతోంది. వీధుల్లో ఉన్న చెత్తను ఆవులు, పందులు తింటూ చెల్లా చెదురు చేయడంతో రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. ఆరిలోవ కాలనీ నుంచి దుర్గాబజార్, టీఐసీ పాయింట్, బాలాజీనగర్, తోటగరువు, రవీంద్రనగర్, ఆదర్శనగర్, విశాలాక్షినగర్, హనుమంతవాకతో పాటు కొండవాలులో పెదగదిలి, చినగదిలిలో ఇదే పరిస్థితి నెలకొంది. ఆరిలోవ జీవీఎంసీ ఆస్పత్రి సమీపం, యూపీహెచ్‌సీల వద్ద చెత్త కుప్పలుగా ఉండడంతో రోగులు మరింత ఇబ్బందిపడుతున్నారు.


ఘనంగా జాతీయ యువజన దినోత్సవం



జాతీయ యువజన దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయ సేవా పథకం, యువజన శాఖ సంయుక్తంగా నిర్వహించిన ఈ వేడుకలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రామకృష్ణ మిషన్ నిర్వాహకుడు స్వామి దివ్యబోధానంద మాట్లాడుతూ స్వామి వివేకానంద ప్రసంగాలను యువత ఆకళింపు చేసుకోవాలని సూచించారు. సెట్విస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ యువత భవితకు స్వామి వివేకానంద మార్గనిర్దేశం చేశారని, వాటిని అనుసరించి ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, జానపద నృత్యం పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్, వాలీబాల్, ఖోఖో పోటీల విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు సెట్విస్ సౌజన్యంతో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ రత్నభారతి, డాక్టర్ పోలా ఉమామహేశ్వరావు, డాక్టర్ సుధీర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అబ్బురపరుస్తున్న పల్లె జీవన చిత్రాలు



పల్లె పడుచుల ముచ్చట్లు



ప్రకృతి కాంతమణి జీవనం చిత్రం



పల్లె జీవన చిత్రం

మద్దిలపాలెం: పల్లె దనం.. పచ్చని వనం.. గలగల పారే సెలేటి సవ్వడుల నడుమ పల్లె జీవనం.. పరమానందభరితం. ఆ పల్లె దనంలో అందాన్ని కుంచె అంచులతో రంగరించి జీవనం పోశారు. పొలం వెంబడి పరుగులు పెట్టే గొర్రె పిల్లల చిత్రాన్ని గీసి అబ్బురపరిచారు. పల్లె పడుచు పచ్చని పచ్చిక బయలులో స్వేద తీరే చిత్రాన్ని వర్ణనాతీతంగా రంగరించారు. పల్లె పడుచుల ముచ్చటలాడుకునే సన్నివేశాన్ని కళ్ల కట్టినట్టుగా మలిచి మైమరిపించారు. గీసిన ప్రతి చిత్రం వెనుక నెమరువేసుకునే చక్కని జ్ఞాపకాన్ని గుర్తు చేశారు. మనసు దోచే చిత్రాలు మలిచి అందరి మన్ననలు పొందారు. ప్రకృతి ఒడిలో హాయిగా సాగే జీవనం. నిశ్శబ్దపు బాధల నుంచి ఉల్లాసంగా సాగే జీవనానికి ప్రతీకగా నిలిచే ఆ చిత్రాలు అందరి హృదయాలను హత్తుకుంటున్నాయి. నిరాడంబర జీవనంలో సంతృప్తిలను.. మట్టి మనుషుల మనసులో గుసగుసలను చక్కని చిత్రాలతో చూపించి అందరి మన్ననలు పొందారు. అలాంటి అద్భుత చిత్రాలకు నిలయంగా మద్దిలపాలెంలో సంపత్ ఆర్ట్స్ గ్యాలరీ నిలిచింది. చిత్రకారుడు రాజు గీసిన అద్భుత చిత్రాలకు సందర్శకులు మంత్రముగ్ధులవుతున్నారు.

ఆసియన్ ఇండోర్ అథ్లెటిక్స్‌కు జ్యోతి



విశాఖ స్పోర్ట్స్: ఆసియన్ ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో నగర అథ్లెట్ వై.జ్యోతి పాల్గొనుంది. ఈ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు భారత్ తరపున 13 మంది చొప్పున వుమెన్, మెన్‌ను భారత అథ్లెటిక్స్ సమాఖ్య ఎంపిక చేసింది. వంద మీటర్ల పరుగులో జాతీయ రికార్డు నెలకొల్పిన విశాఖ అథ్లెట్ జ్యోతి జట్టుకు ఎంపికైంది. కజకిస్తాన్‌లో జరగనున్న ఈ పోటీల్లో 60 మీటర్ల స్ప్రింట్‌తో పాటు 60 మీటర్ల హార్డిల్స్‌లో జ్యోతి పాల్గొనుంది.

వ్యక్తి అనుమానాస్పద మృతి

అల్లిపురం : వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. సీఐ తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం.. పిల్లి వరలక్ష్మి తన రెండో భర్త కనకరాజు, పిల్లలతో కలిసి చలువ తోటలో నివసిస్తుంది. ఆమెకు పిల్లి అప్పారావు అనే వ్యక్తితో తొలుత పెళ్లయింది. వారికి ఇద్దరు పిల్లలు. ప్రస్తుతం ఆమె కనకరాజు, పిల్లి అప్పారావులతో కలసి ఉంటుంది. ఆదివారం రాత్రి కనకరాజు మద్యం మత్తులో వచ్చి వరలక్ష్మితో గొడవపడ్డాడు. తిరిగి రాత్రి 2.30 గంటల ప్రాంతంలో మద్యం తాగి వచ్చి వేరే గదిలో పడుకున్నాడు. తెల్లవారుజామున 4 గంటల సమయంలో కనకరాజు పడుకున్న గది నుంచి అరుపులు వినిపించడంతో వరలక్ష్మి అక్కడికి వెళ్లి చూడగా మంటల్లో కనకరాజు పడి ఉన్నాడు. వరలక్ష్మి మంటలను అదుపు చేసి టూటౌన్ పోలీసులకు సమాచారం అందజేసింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే కనకరాజు మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్రాంతి సెలవుల్లో ప్రత్యేక తరగతులను నిరోధించండి



సీతారామ్‌కు వినతిపత్రం అందిస్తున్న టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ నాయకులు

సీతమ్మధార: ప్రభుత్వం ప్రకటించిన సంక్రాంతి పండగ సెలవుల్లో ప్రత్యేక తరగతులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్వహించకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్, కార్పొరేట్, ఎయిడెడ్ స్కూళ్లు, కాలేజీల్లో చర్యలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలని రాష్ట్ర ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాళ్ల లోకనాథం, జిల్లా కన్వీనర్ కోట్ల గణేష్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆశీలమెట్టలోని కార్యాలయంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్‌కు వారు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీతారామ్ మాట్లాడుతూ సెలవుల్లో నూటికి నూరు శాతం అమలు జరిగేలా తనిఖీ బృందాలను ఏర్పాటు చేయాలని కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో అన్ని జిల్లాల ఆర్‌ఐఓలు, డీఈఓలకు స్పష్టంగా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘించి పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే వాటి గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు చట్టపరమైన చర్యలకు సిఫార్సులు చేయనున్నామని ఆయన చెప్పారు.

అలరించిన సింగర్ కిషోర్‌కుమార్ గీతాలు



సంగీత విభావరిలో పాల్గొన్న గాయనీ గాయకులు

సీతంపేట: ప్రముఖ గాయకుడు కిషోర్‌కుమార్ గీతాలు ప్రజల హృదయాల్లో చిరస్మరణీయంగా నిలిచి ఉంటాయని ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్ ఆపరేషన్స్ బి.రమేష్‌ప్రసాద్ అన్నారు. హిందీ సినీ నేపథ్య గాయకుడు కిషోర్‌కుమార్ జ్ఞాపకార్థం మెలోడీ క్రియేటర్స్, శృతిలయ, రసరాగ మాధురి సంగీత సంస్థల ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సంగీత విభావరి నిర్వహించారు. ఎమ్మెస్ మాధవ్, నిహారిక పాడిన జానెజా దూండ్‌తా, హేమంత్‌కుమార్, శైలజ పాడిన భీగి భీగి రాతోన్‌మే, ప్రభాకర్, ఎన్.రాజేశ్వరి పాడిన కోరా కాగజ్ థా, అమ్మాజీరావు, సీవీ రాజేశ్వరి పాడిన కాంచిరే కాంచిరే, ప్రభాకర్, లక్ష్మీసాత్విక పాడిన గాత రహే మేరా దిల్, ఎస్ఎస్ఎన్ రాజు పాడిన రోటే హువా ఆటే హైసాద్ వంటి పలు హిట్ సాంగ్స్ ఆలపించి ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమంలో న్యాయవాది బైపా అరుణ్‌కుమార్, కొణతాల రాజు, ఫణిస్వామి, చెన్నా తిరుమలరావు, ఎం.వి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో సంస్కృతి సదన్



మహిళలకు కుట్టు మిషన్లు అందిస్తున్న విదేశీ బృంద సభ్యులు, సంస్థ డైరెక్టర్ సత్యదేవ్

తాటిచెట్లపాలెం: సామాన్య ప్రజలకు సేవలందించడమే లక్ష్యంగా జగద్గురు పీఠం ఆధ్వర్యంలో మాస్టర్ ఇ.కె. సంస్కృతి సదన్‌ను స్థాపించినట్లు సంస్థ డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ తెలిపారు. తాటిచెట్లపాలెంలోని సంస్కృతి సదన్‌లో టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు సోమవారం సంస్థను సందర్శించిన విదేశీ బృంద సభ్యులు క్రిస్టినా, మార్కర్స్, డాక్టర్ సెబీనాల చేతుల మీదుగా ఉచితంగా కుట్టుమిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి సదన్ ద్వారా ఇప్పటి వరకు సుమారు 69 బ్యాచ్‌ల్లో 1,600 మంది మహిళలకు వివిధ వృత్తి విద్యల్లో శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. విదేశీ బృంద సభ్యులు మాట్లాడుతూ మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య(ఇ.కె.), మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్‌ల బోధనలు, రచనలు తమనెంతో ప్రభావితం చేశాయని, మార్గదర్శకంగా ఉన్నాయని తెలిపారు. సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నమన్నారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహక సభ్యులు పి.రవిశంకర్, పసుమర్తి కృష్ణమోహన్, మహాత్మా గాంధీ మహిళా కేంద్ర నిర్వాహకురాలు దాట్ల రాధ తదితరులు పాల్గొన్నారు.

ఐవీఎఫ్ సెంటర్ తనిఖీ



ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్

మహారాణిపేట: జిల్లా పరిషత్ ప్రాంతంలో కృష్ణ ఐవీఎఫ్ సెంటర్, విజయ మెడికల్ సెంటర్‌ను వైద్య ఆరోగ్యశాఖ అదనపు సంచాలకుడు డాక్టర్ అనిల్ కుమార్ సోమవారం తనిఖీ చేశారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. ఐవీఎఫ్ కేంద్రంలో పరికరాలతో పాటు వైద్యులు, సిబ్బంది అర్హతలను పరిశీలించారు. విజయ మెడికల్ సెంటర్‌లో కలర్ డాప్లర్, ఎంఆర్ఐ స్కాన్‌లను పరిశీలించి రేడియాలజిస్టులతో సంభాషించారు. స్కాన్ చేసే గదుల్లో లింగ నిర్ధారణ చట్ట రీత్యా నేరం అని తెలిపే బోర్డులు పెద్దవిగా పెట్టాలని సూచించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ పి.జగదీశ్వరరావు, పాడేరు డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ పాషా, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బోటు యజమానికి నష్ట పరిహారం



బోటు యజమానికి నష్టపరిహారం అందిస్తున్న జానకీరామ్

మహారాణిపేట: గతేడాది అక్టోబర్‌లో సూపర్ సైక్లోన్ వల్ల కోణార్క్ తీరంలో కొట్టుకుపోయిన విశాఖపట్నం హార్బర్‌కు చెందిన అర్జిల్ల హరి కుటుంబాన్ని ఏపీ మరపడవల సంఘం ఆదుకుంది. ఈ సంఘటనలో హరి బోటుకు 50 లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లింది. దీంతో బోటు యజమాని కుటుంబానికి 3 లక్షల 50 వేల రూపాయలను రాష్ట్ర మరపడవల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ సోమవారం అందజేశారు. వచ్చే నెలలో మరో రెండు లక్షల రూపాయలను ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మైలపల్లి లక్ష్మణరావు, ఇతర నాయకులు మైలపల్లి నరసింహులు, జి.పోతయ్య, వాసుపల్లి దాసు, మూగి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య కొట్లాట

తగరపువలస: భీమిలి మండలం గొల్లల తాళ్లవలసలో స్థల వివాదంపై సోమవారం ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాటలో అయిదుగురు వ్యక్తులు గాయపడ్డారు. సర్వే నంబర్ 199/2లో 4.13 ఎకరాల స్థలం తమదని తాళ్లవలసకు చెందిన అక్కరమాని తోటయ్య వర్గం వాదిస్తుండగా నగరానికి చెందిన మరో వర్గం తమదని కొన్ని రోజులుగా నిరూపించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాటలో తోటయ్య వర్గానికి చెందిన మహిళలు అక్కరమాని రామయ్యమ్మ, చిన్నమ్మ, నూకమ్మ, సింహాచలం గాయపడి భీమిలి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మరో వర్గానికి చెందిన వ్యక్తి గాయపడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఇరువర్గాలు భీమిలి స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోగా సీఐ కె.లక్ష్మణమూర్తి విచారిస్తున్నారు.